# మలేరియాను తరిమికొడదాం..

**• ఊరూరా జాతీయ మలేరియా నివారణ దినోత్సవ ర్యాలీలు • వ్యాధి నివారణపై అవగాహన కల్పించిన ఆశ కార్యకర్తలు**



కొడంగల్ అంబేద్కర్ కూడలిలో ర్యాలీ ..



మర్పల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



కులకచర్ల మండల కేంద్రంలో..

కొడంగల్, ఏప్రిల్ 25: మలేరియాను తరిమి కొడదామని ఈ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమ కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమ కాటుతో మలేరియా, ఫైలేరియాతో పాటు డెంగీ వచ్చే అవకాశం ఉందన్నారు. వేసవిలో ఆరబయట నిద్రించే వారు దోమ తెరను తప్పకుండా వాడాలని తెలిపారు. అలాగే దోమల నివారణకు మందులను తప్పకుండా పిచికారీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫైలేరియా సిబ్బంది ఫకీరప్ప, అంగడిరైచూర్ ఆరోగ్య సిబ్బంది మధుసూదన్‌రెడ్డితో పాటు ఆశ కార్యకర్తలు ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

**దోమ, కులకచర్ల :** కులకచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హాజీహుద్దీన్, మాధురి, సీహెచ్‌వో చంద్ర ప్రకాశ్, పల్లె దవాఖాన డాక్టర్ ప్రశాంతి, సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**మర్పల్లి :** మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్లూర్ పీహెచ్‌సీ డాక్టర్ నేహ అన్నారు.. గురువారం పట్లూర్ మండల కేంద్రంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజూ డ్రైడేగా పాటిద్దామని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అమరేశ్వరి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వికారాబాద్, ఏప్రిల్ 25: మండల పరిధిలోని మదన్‌పల్లి సంగయ్యలొంక ఆలయ ఉత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. ఇందులో భాగంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

## ▪ మాజీ ఎమ్మెల్యే పరామర్శ..



పరిగి టౌన్, ఏప్రిల్ 25: ఇటీవల మృతిచెందిన రంగంపల్లి గ్రామానికి చెందిన పుల్లారెడ్డి కుటుంబ సభ్యులను గురువారం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించారు. ఎల్లప్పుడూ అండగా ఉంటానని వారికి భరోసా కల్పించారు. ఆయన వెంట నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, మొగులంత్‌రెడ్డి, నీరటి నరహరి ఉన్నారు.

## స్వచ్ఛం.. సురక్షితం.. మిషన్ భగీరథ నీరు



మిషన్ భగీరథ నీటిపై అవగాహన కల్పిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి జయసుధ

పెద్దేముల్, ఏప్రిల్ 25 : మిషన్ భగీరథ నీరు అత్యంత సురక్షితమని, స్వచ్ఛమైనదని జిల్లా పంచాయతీ అధికారిణి జయసుధ, ఎంపీడీవో జర్నప్ప తెలిపారు. గురువారం మండల పరిధిలోని రాంసింగ్ తండావాసులకు మిషన్ భగీరథ నీటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యానికి మేలు చేసే మిషన్ భగీరథ నీటిని ప్రతి ఒక్కరూ తాగాలని సూచించారు. రాంసింగ్ తండాలో మిషన్ భగీరథ నీరు పుష్కలంగా వస్తున్నప్పటికీ తండావాసులు తాగకపోవడం ఆశ్చర్యంగా ఉఅన్ని పరీక్షల అనంతరం శుద్ధి చేసి ఈ నీటిని వదులుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ నీటిని తాగాలన్నారు. అంతకు ముందు అధికారులు తండాలోని పలు కాలనీల్లో తిరుగుతూ మిషన్ భగీరథ నీటిని తాగుతూ.. ప్రజల చేత తాగిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాషాపూర్ పంచాయతీ కార్యదర్శి రవిప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

# బాధ్యతగా పని చేయడమే ఇష్టం

**వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్**



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

వికారాబాద్, ఏప్రిల్ 25 : ఎక్కడ పని చేసినా బాధ్యతాయుతంగా పని చేయడమే ఇష్టమని వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ తెలిపారు. వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు సుదర్శన్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టులో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులందరికీ న్యాయం జరిగేలా సేవలందించానని తెలిపారు. వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసిన బార్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రధాన న్యాయమూర్తి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ న్యాయమూర్తి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్, న్యాయవాదులు సంపూర్ణా ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, కమాల్‌రెడ్డి, బస్వరాజ్, మహ్మద్ రఫీ, శ్రీనివాసరావు, శుక్లావర్ధన్‌రెడ్డి, నాగరాజు, బి.శంకరయ్య, నారాయణ, బాలయ్య, అనిల్‌కుమార్, టి.వెంకటేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



దోమ, ఏప్రిల్ 25 : మండల పరిధిలోని పాలేపల్లి గ్రామంలో గురువారం పాలేపల్లి క్రికెట్ లీగ్ 2024 టోర్నమెంట్‌ను కేఎస్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విజయగోపాల్,మాజీ సర్పంచ్ యశోదాతిరుపతయ్య, నర్సింహులు, లింగయ్య, మణికంఠ, క్రీడాకారులు,యువకులు పాల్గొన్నారు.

# అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

**ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చబ్రా**



ఎన్నికల వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్‌చబ్రా

వికారాబాద్, ఏప్రిల్ 25 : ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు విధులు నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చబ్రా అన్నారు. గురువారం వికారాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంటరీ ఎన్నికలకు సంబంధించి వికారాబాద్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటరీ ఎన్నికలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించేందుకు వీలుగా చేపట్టిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చేపడుతున్న వివిధ అంశాలపై అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, వ్యయ పరిశీలకులకు వివరించారు. ప్రతి రోజూ దినపత్రికలు, వివిధ శాటిలైట్, లోకల్ ఛానల్, సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలు, పేయిడ్ న్యూస్‌కు సంబంధించినవి క్షుణ్ణంగా పరిశీలించి రికార్డ్ చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. వారి వెంట జిల్లా పరిషత్ సీఈవో సుధీర్, మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వివిధ ఎన్నికల విభాగాల్లో పని చేసే సిబ్బంది పాల్గొన్నారు.

## ▪ బసిరెడ్డిపల్లివాసికి డాక్టరేట్..



పరిగి టౌన్, ఏప్రిల్ 25 : మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మద్దులపల్లి శ్రీశైలం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాపొందారు. చరిత్ర విభాగంలో ఇంటలెక్చువల్స్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టాపొందాడు. ఈ మేరకు యూనివర్సిటీ ప్రొఫెసర్లు గురువారం పీహెచ్‌డీ పట్టాను అతడికి ప్రదానం చేశారు.

## ఒంటరిగా వెళ్తుంటే బలవంతంగా లాక్కెళ్లి..



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

మూసాపేట, ఏప్రిల్ 25: మహిళపై లైంగికదాడికి పాల్పడి, ఆ తర్వాత హత్య చేసిన నిందితులను కూకట్‌పల్లి పోలీసులు గురువారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కూకట్‌పల్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. ఈ నెల 21న తెల్లవారు జామున కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ఓ భవనం సెల్లారులోని షట్టరు ముందు గుర్తు తెలియని మహిళా(45)పై ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడి, హత్య చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. రెండు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నిందితుల ఆచూకీ తెలుసుకున్నారు. నిందితులిద్దరిని సంగారెడ్డిలో అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి...

బీహార్‌కు చెందిన నితీష్ కుమార్(24), మరోనిందితుడు మైనర్. వీరిద్దరూ సంగారెడ్డిలోని తిరుమల బార్ అండ్ రెస్టారెంట్‌లో వేటార్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 20న బీహార్‌కు వెళ్తున్న తమ స్నేహితుడిని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దించి, అక్కడి నుంచి బైక్‌పై సంగారెడ్డికి బయలుదేరారు. మార్గమధ్యలో ప్రశాంత్‌నగర్‌లో టీ తాగడానికి ఆగారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వారికి అటుగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ కనిపించింది. ఆమెను గమనించి స్థానికంగా ఉన్న ఓ భవనం సెల్లారులోకి బలవంతంగా లాక్కెళ్లారు. ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించడంతో ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆమె తలను నేలకు బలంగా కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి, మృతిచెందింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బైక్ నంబర్, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను సంగారెడ్డిలో గుర్తించి, అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, డీఐ వెంకన్న, ఎస్సైలు రామకృష్ణ, ఆర్.ప్రేమ్‌సాగర్, జి.చంద్రకాంత్, ఇంద్రసేనారెడ్డి, కానిస్టేబుళ్లు ఎం.నవీన్, జయంత్, రాంచందర్, ఎండీ షకీల్‌ను ఏసీపీ అభినందించారు.

# మరణిస్తూ జీవితాలనిచ్చారు..





ఖైరతాబాద్, ఏప్రిల్ 25 : వారు మరణించినా.. వారి అవయవాలతో మరొకరికి జీవితాలనిచ్చారు. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం గడ్డమల్లయ్యగూడెంకు చెందిన యారయాదగిరి (43) రైతు. ఈ నెల 19న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఓ కుక్క అడ్డురావడంతో కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన యాదగిరిని ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 24న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా.. అందుకు వారు అంగీకరించారు. ఆయన శరీరం నుంచి గుండె, కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లను సేకరించారు.

**బైక్ పైనుంచి కిందపడి**

ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన సుంకర సులోచన (53) గృహిణి. ఈ నెల 21న ఆమె కుమారుడితో కలిసి బైకుపై వెళ్తుండగా స్కిడ్ అయ్యింది. దీంతో కింద పడిపోయిన బాధితురాలికి తీవ్రగాయాలు కాగా, తొలుత ఖమ్మం జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఫలితం లేకపోవడంతో సోమాజిగూడలోని యశోదకు తీసుకువచ్చారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 24న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతినిధుల ఆమె కుటుంబ సభ్యులు కలిసి అవయవదానం విశిష్టతను వివరించడంతో ఒప్పుకున్నారు. దీంతో ఆమె శరీరం నుంచి కాలేయం, ఓ ఊపిరితిత్తి, రెండు మూత్రపిండాలు, నేత్రాలను సేకరించారు. అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ అభినందించింది.

## ▪ కాంగ్రెస్‌లో చేరిక..



రామకృష్ణారెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట, ఏప్రిల్ 25 : దుద్యాల మండలంలోని పోలేపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి గురువారం హైదరాబాద్‌లో కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తిరుపతిరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, నర్సింహులు, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

## పెండ్లి కోసం వచ్చి కటకటాలపాలు

**జూబ్లీహిల్స్ ప్రమాదంలో ఎన్‌ఆర్‌ఐ రిమాండ్**

బంజారాహిల్స్, ఏప్రిల్ 25 : స్నేహితుడి పెండ్లి కోసం విదేశాల నుంచి నగరానికి వచ్చిన ఓ ఎన్‌ఆర్‌ఐ జూబ్లీహిల్స్‌లో జరిగిన కారు బీభత్సం కేసులో కటకటాలపాలయ్యాడు. అతడితో పాటు అదే కారులో ప్రయాణిస్తున్న స్నేహితులకు బెయిల్ లభించింది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 45లో నివసించే చలసాని అవినాశ్ అనే ఎన్‌ఆర్‌ఐ సోదరుడి వివాహానికి అమెరికాలో నివాసముంటున్న టార్గెట్ సెక్యూరిటీ సంస్థ సీఈవో ఈతెన్ వెంకటేశ్ (23), దుబాయిలో ఉంటున్న సషా (23), జర్మనీకి చెందిన మ్యాక్మిలన్ హెన్నీ రాడింగర్ (23), అమెరికాలో నివాసముండే సాయిప్రీతం కాసం (23) నాలుగు రోజుల కిందట నగరానికి వచ్చారు. పార్క్ హయత్‌లో బస చేసిన నలుగురు స్నేహితులతో కలిసి చలసాని అవినాశ్ జూబ్లీహిల్స్‌లోని కారా పబ్‌లో మంగళవారం జరిగిన పార్టీకి హాజరయ్యారు. బుధవారం తెల్లవారుజాము 2.45 గంటల వరకు పార్టీలో మద్యం సేవించిన తర్వాత అవినాశ్ కుటుంబానికి చెందిన కారులో పార్క్ హయత్‌కు బయలుదేరారు. వెంకటేశ్ కారు నడుపుతూ విపరీతమైన వేగంతో వస్తుండగా, కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో కారు నడిపిన వెంకటేశ్ తోపాటు కారులో ఉన్న వారందరినీ ఐపీసీ సెక్షన్ 308, 279, 336తో పాటు పీడీపీపీ యాక్ట్ కింద నిందితులుగా చేర్చిన జూబ్లీహిల్స్ పోలీసులు.. వారందరినీ గురువారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కారు నడిపిన వెంకటేశ్‌కు 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు, మిగతా నలుగురికి బెయిల్‌ను మంజూరు చేసింది.

# బంగారం దొంగ అరెస్టు

**151.83 గ్రాముల బంగారం స్వాధీనం**



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఐ మధుసూదర్ తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 25 : క్రికెట్ బెట్టింగ్.. ఆన్‌లైన్ రమ్మీ గేమ్‌తో పాటు మద్యానికి అలవాటు పడి, డబ్బు కోసం దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్ తరలించారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీ పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రావు, డీఐ మధుసూదన్ వివరాలను వెల్లడించారు. భువనగిరి జిల్లాకు చెందిన భానోతు భాస్కర్ అలియాస్ శంకర్ (21) బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేస్తాడు. క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఆడుతూ.. మద్యానికి అలవాటు పడి, డబ్బు కోసం దొంగతనాలు మొదలుపెట్టాడు. ఈ నెల 3న కేపీహెచ్‌బీ కాలనీలోని లలితా జువెల్లరీ దుకాణానికి బంగారు గొలుసు కొనుగోలు చేసేందుకు కస్టమర్‌గా వెళ్లాడు. సేల్స్‌గర్ల్ నాగలక్ష్మిని కలిసి గొలుసు నచ్చిందని, ధర ఎంతని అడిగి.. తన మాయమాటతో ఆమెను బురిడీ కొట్టించి ఆ దుకాణంలోని 28.405 గ్రాముల బంగారు గొలుసును తస్కరించి, పారిపోయాడు. కేపీహెచ్‌బీ కాలనీ పీఎస్ పరిధిలో రెండు చోట్ల, పంజాగుట్ట, మహంకాళి, నిర్మల్, మిర్యాలగూడ, మక్తల్, చైతన్యపురి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎనిమిది దొంగతనాలకు పాల్పడి, తప్పించుకుని తిరుగుతూ.. చివరకు పోలీసులకు చిక్కాడు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన 28.405 గ్రాముల బంగారు గొలుసుతో పాటు 8 పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన 151.83 గ్రాములు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించారు. గతంలో కూడా నిందితుడు రెండు దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కాడు.

## ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్ అంటూ..

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): మీ పేరుతో వచ్చిన ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్, గడువు తీరిన ఏడు పాస్‌పోర్టులు ఉన్నాయంటూ ముంబై సైబర్‌క్రైమ్ ఆఫీసర్స్ పేరుతో బెదిరించిన సైబర్‌నేరగాళ్లు ఓ మాజీ ఉద్యోగి నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.50 లక్షలు దోచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడికి ఓ కాల్ వచ్చింది. ముంబై సైబర్‌క్రైమ్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నట్టు చెప్పారు. మీరు వెంటనే వీడియో కాల్‌లోకి రావాలంటూ చెప్పి, స్కైప్‌లో వీడియో కాల్ చేశారు. మీ పేరుతో వచ్చిన పార్శిల్‌కు మీ ఆధార్ కార్డు, మొబైల్ నంబర్లు లింక్ అయి ఉన్నాయి, అందులో డ్రగ్స్ ఉన్నాయంటూ బెదిరించారు. మా విచారణకు మీరు సహకరించకపోతే వెంటనే హైదరాబాద్‌లో ఉండే పోలీసులు వచ్చి మిమ్మల్ని అరెస్ట్ చేస్తారంటూ ఒత్తిడి చేశారు.

మీ పేరుతో 20 బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, అన్నింటికి ఈ ఆధారే ఉపయోగించాలంటూ స్కైప్‌లో మాట్లాడారు. మీ వద్ద ఉన్న బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పండంటూ బాధితుడి వద్ద నుంచి హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకున్నారు. ఆ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 49,35,134 నగదును నేరగాళ్లు తమ ఖాతాల్లో బదిలీ చేసుకున్నారు. కేసు విచారణ జరుగుతున్నదని, డబ్బు తిరిగి మీకే ఇచ్చేస్తామంటూ నమ్మించి, ఆ డబ్బులన్ని కాజేశారు. ఆ షాక్ నుంచి తేరుకున్న బాధితుడు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఉద్యానవనంలోని మామిడి చెట్లు వేలం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 25: జిల్లాలోని ఉద్యాన వన నర్సరీలో ఉన్న మామిడి చెట్ల ఫలాల కోసం బహిరంగ వేలాన్ని గురువారం నిర్వహించినట్లు ఉద్యాన వన శాఖ అధికారి తెలిపారు. ఈ వేలంలో బాబు అనే వ్యక్తి రూ.2.75లక్షలకు మామిడి చెట్లను దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి జిల్లా ఉద్యాన అధికారి సత్తార్, తాండూరు కోఆర్డినేటర్ డాట్ సెంటర్ లక్ష్మణ్ , వ్యవసాయ సహాయ సంచాలకుడు వినోద్ కుమార్ ఉద్యాన అధికారిణి అర్చన , కమల, గఫూర్, స్నేహిత తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ ఫలితాల్లో గురుకుల విద్యార్థినుల సత్తా

వికారాబాద్, ఏప్రిల్ 25 : ఐఐటీ, జేఈఈ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో వికారాబాద్ కొత్తగడి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు సత్తా చాటారు. వీరిలో 10 మంది జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని హెచ్‌ఆర్ఆర్ డబ్ల్యూఈఎస్‌టీ ఆర్‌సీవో డాక్టర్ శారదా వెంకటేశ్, కళాశాల ప్రిన్సిపాల్ పి.అపర్ణలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల్లో సత్తా చాటిన పి.అనురాధ, ఏ.శైలజ, బి.శ్రావణి, థెరిసా, శ్రీయ, వై.వైష్ణవి, ఆకాంక్ష, జి.తేజశ్విని తదితర విద్యార్థినులను ఈ సందర్భంగా వారు అభినందించారు.